మినీ కథ

# కోరిక



లెదర్ బ్యాగ్ చేత్తోపట్టుకుని, ఆటోలోంచి క్రిందికి దిగుతున్న సుబ్బారావును చూసి నా ఒళ్ళు మండిపోయింది.

చెప్పొద్దూ! విపరీతమైన కోపం కూడా వచ్చింది. ఎంత కోపమంటే? సుబ్బారావునా దగ్గరకొచ్చి "ఏం అన్నయ్య! బాగున్నావా?" అని అడిగితే "అన్నయ్యా?!ఎవర్నీకు అన్నయ్య? నేనా? కాదే బహుశా నువ్వు పొరపడుంటావు." అని దబాయించేసి తిరిగొచ్చిన దారినే పంపించేయాలన్నంత కోపం మొచ్చింది.

సాధారణంగా నాక్కోపం రాదు. వచ్చిందంటే ఇదిగో ఇలాంటప్పుడే వస్తుంది. లేకపోతే, వీడు ఈరోజే రావాలా? ఎంతకాలం నుంచో నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ చూడాలన్నకోరిక! స్నేహితులు దాని గురించి గొప్పగా చెప్తుకుంటూ ఉంటే విని, రెండు మూడు సార్లు వెళ్దామని ప్రయాణమై అనుకోని ఇబ్బందులు వల్ల వాయిదా పడిన కోరిక! ఇప్పుడు విహారయాత్రల కోసం మా ఆఫీస్ తరవు నుంచి వేసిన టూరిస్ట్ బస్సులో ఈరోజు సాయంత్రం ఆరు గంటలకు నేను బయలుదేరటంతో తీరుతుందనుకుంటున్న కోరిక! ఇదిగో ఈరోజు వీడు రావడంతో నీరుగారిపోయేలా వుంది.

నేను మాఇంటికి ఉత్తరం కూడా రాశాను. మా ఆఫీస్ తరవు నుంచి వేసిన టూరిస్ట్ బస్సులో నేను విహార యాత్రలకు వెళ్తున్నట్టు. అయినా వీడు వచ్చాడంటే ఏదో అర్జంట్ పని మీదే అయుంటుంది. ఈసారి కూడా నాకోరిక, కోరికగానే మిగిలిపోయేలా వుంది.

"ఏమిటన్నయ్యా? అలా బొమ్మలా బిగుసుకుపోయి నిలబడిపోయావు?'అన్న సుబ్బారావు మాటలతో ఆలోచనా స్రవంతికి స్వస్తి చెప్పి వాణ్ణి ఇంట్లోనికి తీసుకెళ్ళి, కుర్చీలో కూర్చోబెట్టి కాస్త ఆవేశంగానే అడిగాను "నువ్వు రావడానికి కారణమేమిట్రా తమ్ముడూ?"అని.

ఏమిలేదన్నయ్యా! ఈమధ్య నాకు విపరీతంగా కడుపు నొప్పి వస్తోంది. మనూర్లో డాక్టరుకు చూపించి ఎన్ని మందులు వాటినా తగ్గడం లేదు. అందుకే వారం రోజులుండి, నిన్ను తీసుకువెళ్ళి ఇక్కడి పెద్ద డాక్టరుకు చూపించుకోమని నాన్న పంపిస్తే వచ్చాను"అన్న సుబ్బారావుమాటలతో చిగురిస్తుందేమేనన్న ఆశ కాస్త పూర్తిగా చచ్చిపోయింది.

"అయితే నేను ఉత్తరంలో రాసిన విషయం చదివి కూడా నాన్న నిన్ను పంపించాడన్నమాట?" అన్నాను నా కోరికను చివర్లో ఇలా ఆటంకం కలిగిస్తున్నందుకు ఉక్రోషాన్ని వ్యక్తం చేస్తూ.

"ఉత్తరమే! నెలరోజుల్నుండి నీదగ్గర్నుంచి ఒక్క ఉత్తరం కూడా రాలేదు." అన్నాడు సుబ్బారావు. నాకప్పుడు గుర్తుకొచ్చింది నేను విహారయాత్రలను వెళ్తున్నటట్లు రాసిన ఉత్తరం పోస్ట్ చేద్దామనుకుని అద్దెకు తెచ్చిన నవల్లో పెట్టి, మర్చిపోయి ఉత్తరంతో పాటే ఆ పుస్తకం నవలలు అద్దెకిచ్చే షాపులో ఇచ్చేసిన సంగతి.

నా మతిమరుపుమూలంగా ఈరోజు నాకోరికకే చిక్కులొచ్చి పడ్డాయి. పోనీ వీడికి నా విహార యాత్రల గురించి చెప్పి తిరిగి పంపించేద్దామన్నా వీడు విశాఖపట్నానికి చాలా దూరంలో నున్న ఓ మారుమూల పల్లెటూరినుంచొచ్చాడు. అదీగాక వీడొచ్చింది విశాఖపట్నం అందచందాలను చూడడానికి కాదే, వైద్యం చేయించుకోవడానికి! ఇక ఆలోచించి ఏం ప్రయోజనం, నా ప్రయాణం కాన్సిల్ చేసుకుని సుబ్బారావుని హాస్పిటల్‌కు తీసుకెళ్ళి డాక్టరుకు చూపించడం తప్పా!

ఆరోజు నుంచి సుబ్బారావు, నేనూ హాస్పిటల్ చుట్టూ, డాక్టర్ చుట్టూ చేసిన ప్రదక్షిణాలతో భారంగా గడిచిపోయాయి ఆర్రోజులు.

ఈరోజే మా ఆఫీస్ స్టాఫ్ ముందుగా వేసుకున్న ప్లాన్ ప్రకారం తమ విహార యాత్రలను దిగ్విజయంగా తిలకించి తిరిగొచ్చే రోజు అనుకుంటూ పేపరు తిరగేస్తున్న నాకు మతిపోయినంత పనైంది.

'నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ చూసి తిరిగొస్తున్న విశాఖపట్నానికి చెందిన ఫలానా సంస్థ ఉద్యోగస్తుల టూరిస్ట్ బస్సు అదుపు తప్పి నదిలో పడిపోవడంతో అందులో ప్రయాణిస్తున్న వారందరూ జలసమాధి అయ్యారు.' అది క్లుప్తంగా ఆ పేపర్లో ఓ వార్త సారాంశం.

సుబ్బారావు వల్లే నాకు ప్రాణ గండం తప్పిందని ఆనందంగా ఎగిరిగంతులేస్తున్న నావైపే గుడ్లప్పగించి వింతగా చూస్తున్నాడు మా తమ్ముడు సుబ్బారావు.

— బి.బాలరామస్వామి.
కశింకోట.